


పుస్తక పఠనంతో ఆలోచన శక్తి

ప్రజాశక్తి-విజయనగరం కోట

పుస్తకం మనిషి ఆలోచన శక్తిని పెంచుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎన్.లలిత తెలిపారు. ఆదివారం ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో విలువలు ఉన్న వ్యక్తులుగా జీవించడానికి పుస్తకాలు ఉపయోగపడతాయని తెలిపారు. పుస్తకం చదవడం ద్వారా మానసిక ఉల్లాసం, ఆలోచన శక్తి పెరుగుతాయని తెలిపారు. పుస్తకం అందించే సమాచారం శాశ్వతంగా ఉంటుందని చెప్పారు. పిల్లలకు పుస్తకం పఠనం అలవాటు చేయాలని, చరవాణికి దూరంగా ఉంచాలని కోరారు. అనంతరం గ్రంథాలయంలో చదువుకుంటున్న పాఠకులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప గ్రంథాలయ అధికారి బి.లక్ష్మి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రండి బాబు.. రండి..!



అర్ధాంతరంగా నిలిచిపోయిన రామతీర్థసాగర్ ప్రాజెక్టు

- సాగునీటి రంగానికి నిధులేవీ?
- అరకొర కేటాయింపులూ ఖర్చుచేయని వైనం
- తోటపల్లి, తారకరామ సహా లక్ష్యాన్ని చేరుకోని జలాశయాలు
- నేడు సాగునీటి పారుదలశాఖ మంత్రి అంబటి రాంబాబు రాక

రండి బాబు రండి... ఎందెందు చూసినా ఏముంది గర్వకారణం అన్నట్టుగా విజయనగరం ఉమ్మడి జిల్లాలో ఏ సాగునీటి ప్రాజెక్టు చూసినా ఏముంది గర్వకారణం. తోటపల్లి సహా ఒక్కటంటే ఒక్క సాగునీటి ప్రాజెక్టు కూడా లక్ష్యానికి అనుగుణంగా సాగునీరు అందించడం లేదు. ఏటా ప్రచార ఆర్బాటం తప్ప అవసరానికి అనుగుణంగా నిధులు కేటాయించకపోవడం, కేటాయించిన అరకొర బడ్జెట్ కూడా ఖర్చుచేయకపోవడమే ఇందుకు కారణం. ఈ నేపథ్యంలో సాగునీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు పర్యటనపై సర్వత్రా చర్చ సాగుతోంది. ఉత్తుత్తి సమీక్షలు, చిత్తశుద్ధి లేని కేటాయింపులు ఎందుకు ఉపయోగ పడతాయని రైతాంగం చర్చించుకుంటోంది.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో సుమారు 80 శాతం ప్రజానీకం ప్రత్యక్షంగా, పరోక్షంగా వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. వర్షపాతానికి కొదవలేదు. నదులు, జీవ గెడ్డలూ తగినన్ని ఉన్నాయి. వాటిపై జలాశయాలు నిర్మించాలన్న చిత్తశుద్ధి, ఇప్పటికే చేపట్టిన ప్రాజెక్టులను పూర్తిచేయాలన్న ఆసక్తి లేకపోవడంతో నేటికీ లక్షలాది ఎకరాలు బీడువారుతోంది. చేపట్టిన ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉండటంతో సాగునీటి కోసం ఎదురు చూస్తున్న కళ్లు కడగండ్లు కాస్తున్నాయి. ముఖ్యంగా 2004లో చేపట్టిన 64 వేల ఎకరాల సాగునీటిని స్థిరీకరిస్తూనే పార్వతీపురం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో 1,31,221 ఎకరాలకు సాగునీరు అందించేందుకు 2004లో తలపెట్టిన తోటపల్లి ప్రాజెక్టుకు ఇప్పటి వరకు రూ.891 కోట్లు ఖర్చు చేసినప్పటికీ నిధులు సకాలంలో విడుదల చేయకపోవడం వల్ల అంచనా వ్యయం ఏటా పెరిగిపోతోంది. వైసిపి అధికారంలో వచ్చాక సాగునీటి కేటాయింపులు పరిశీలిస్తే 2019-20 బడ్జెట్‌లో రూ.156 కోట్లు కేటాయించగా, ఆచరణలో రూ.13.64 కోట్లు మాత్రమే ప్రభుత్వం విడుదల చేసింది. 2020-21లో రూ.225.57 కోట్ల కేటాయించగా రూ.37.27 కోట్లు చెల్లించింది. 2021-22లో 189.70 కోట్లకు గాను రూ.135 కోట్లే ఇచ్చింది. 2022-23లో 126.61 కోట్లు కేటాయిస్తామని చెప్పినప్పటికీ ఆచరణలో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. మరోవైపు సుమారు రూ.6.37 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులు నిలిపేశారు. ఇంకా పిల్లకాలువలు, మధుములు, స్ట్రక్చర్లు, లైనింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. మరో 291.48 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. వీటన్నింటికీ ప్రాజెక్టు అధికారులు అంచనా వేసి ప్రతిపాదనలు పంపగా ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేవలం రూ.80.84 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇందులో పెండింగ్ పనులకు రూ.73.13 కోట్లు, భూమి కొనుగోలుకు రూ.3.75 కోట్లు, ఆర్అండ్ఆర్‌కు రూ.3.96 కోట్లు విభజించారు. ఇప్పటికే నిధులు సరిపోక కాంట్రాక్టర్ పనులు నిలిపివేసిన పరిస్థితుల్లో తాజా కేటాయింపులు మరింత విస్మయానికి గురిచేస్తున్నాయి. పెండింగ్ పనుల వల్ల 58,757 ఎకరాలకు సాగునీరు అందడం లేదు.

24 వేల ఎకరాలకు సాగునీటితోపాటు విజయనగరం ప్రజల దాహార్తిని తీర్చేందుకు తలపెట్టిన రామతీర్థసాగర్ ప్రాజెక్టుకు గతేడాది (2022-23) 124.50 కోట్లు కేటాయిస్తామంటూ బడ్జెట్ సమావేశంలో చెప్పిన ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. అంతకు మునుపు కూడా తోటపల్లి మాదిరిగానే అరకొర బడ్జెట్ కేటాయించింది. ఇటువంటి కారణాల వల్ల రూ.220 కోట్లతో తలపెట్టిన ఈ ప్రాజెక్టు అంచనా విలువ 2020 ఏప్రిల్ నాటికి 739.9 కోట్లకు పెరిగిపోయింది. ఇప్పటి వరకు ఖర్చుచేసింది మాత్రం రూ.281.51 కోట్లు మాత్రమే. ఈ నిధులతో బ్యారేజీ పని 90 శాతం, జలాశయం పనులు 60 శాతం, కాలువల పనులు 6 శాతం పూర్తయ్యాయి. మిగులు పనులు, 350 ఎకరాల మేర భూసేకరణ, ఆర్అండ్ఆర్‌కు మరో 458.38 కోట్లు అవసరమౌతాయని ప్రాజెక్టు అధికారులు ఏటా నివేదికలు పంపుతూనే ఉన్నారు. ప్రభుత్వం మాత్రం కంటితుడుపు కేటాయింపులు చేస్తోంది. దీంతో, అటు తోటపల్లి, ఇటు రామతీర్థసాగర్ ప్రాజెక్టులు పూర్తికావడం లేదు. 2023-24 బడ్జెట్‌లో జలాశయం, కాలువల నిర్మాణ పనులకు రూ.101.31 కోట్లు, ఆర్అండ్ఆర్‌కు రూ.175 కోట్లు, భూసేకరణకు రూ.38.24 కోట్లు చొప్పున మొత్తం రూ.314.55కోట్లు కేటాయించాల్సి ఉండగా కేవలం రూ.50 కోట్లు కేటాయించారు. ఇందులోనూ పునరావాసానికి రూ.10 కోట్లు పోతే పనులకు మిగిలినవి కేవలం రూ.40 కోట్లే. ఈ నిధులు ఏమూలకూ సరిపోని పరిస్థితి. పనులు ముందుకు సాగకపోవడమే ఇందుకు తార్కాణంగా చెప్పుకోవచ్చు. అటు పార్వతీపురం జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకమైన జంఝావతికీ అంతంత మాత్రంగానే నిధులు కేటాయించారు. జంఝావతికి రూ.39.60 లక్షలు, వెంగళరాయసాగర్‌కు రూ.14.72 లక్షలు, మడ్డువలసకు రూ.17.57లక్షలు కేటాయించారు. తాటిపూడి, ఆండ్ర, పెద్దగెడ్డ, పెదంకలాం, డెంకాడ ఆనకట్టు, వట్టిగెడ్డ జలాశయాల ఆధునీకరణకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎలాంటి సహకారమూ లేదు. ఇటువంటి పరిస్థితుల్లో సాగునీటి రంగానికి నిధులు పెంచడం, కేటాయించిన నిధులన్నీ విడుదల చేసి, పనులు ముందుకు సాగించాల్సిందిపోయి ఉత్తుత్తి సమీక్షల వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని రైతాంగం భావిస్తోంది.

నేడు సమీక్ష

సోమవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో జరిగే సమీక్షా సమావేశానికి నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరుకానున్నారు. ఇందులో జిల్లాకు చెందిన విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ కూడా పాల్గొన నున్నారు. అనంతరం శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం రాపాక గ్రామంలో మడ్డువలస రెండో దశ పనులను ప్రారంభిస్తారు.



సభాస్థలిని పరిశీలిస్తున్న సిఎం కార్యక్రమాల సమన్వయకర్త రఘురాం, జెడ్‌పి చైర్మన్, కలెక్టర్, ఎస్‌పి

సిఎం సభాస్థలి ఖరారు

ఏర్పాట్లు ప్రారంభించిన యంత్రాంగం

ప్రజాశక్తి-భోగాపురం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి బహిరంగ సభ నిర్వహించే ప్రదేశం ఖరారైంది. మే 3న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి మండలంలోని ఎ.రావివలస-సవరవిల్లి గ్రామాల వద్ద సిఎం శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం అక్కడ బహిరంగ సభను నిర్వహిస్తారు. ఇక్కడి నుంచే చింతపల్లి జెట్టీ నిర్మాణం, తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు పెండింగ్ పనులను ప్రారంభిస్తారు. ముఖ్యమంత్రి పాల్గొనే బహిరంగ సభ స్థలాన్ని, సిఎం కార్యక్రమాల సమన్వయ కర్త తలశిల రఘురామ్, జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్‌పి దీపిక ఆదివారం పరిశీలించారు. సభా వేదిక, విఐపి గ్యాలరీ, హెలీప్యాడ్, పైలాన్ ఏర్పాటు, వాహనాలకు పార్కింగ్ తదితర అంశాలపై చర్చించి ఖరారు చేశారు. హెలీప్యాడ్ కోసం ఎ.రావివలస వద్దనున్న ఖాళీ స్థలాన్ని పరిశీలించి ఆమోదించారు. ఈ పర్యటనలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, ఆర్అండ్‌బి ఎస్ఇ జయశ్రీ, ఇఇ రమణ, తహశీల్దార్ కె.శ్రీనివాసరావు, ఎయిర్‌పోర్ట్ భూసేకరణ సమన్వయాధికారి అప్పలనాయుడు, జిఎంఆర్ సిఇఒ మణ్మయ్, ప్రాజెక్టు మేనేజర్ రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రకే తలమానికం : జెడ్‌పి చైర్మన్

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు తలమానికమని జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ మే 3న శంకుస్థాపన చేయడం ద్వారా ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల కలను ముఖ్యమంత్రి నెరవేర్చనున్నారని చెప్పారు. విమానాశ్రయం ఏర్పాటు ద్వారా ఈ ప్రాంత రూపురేఖలు మారిపోతాయని, ప్రత్యక్షంగా పరోక్షంగా ఎంతోమందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు.

సిఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

విజయనగరం : ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. మే 3న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి సిఎం శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో పర్యటనా ఏర్పాట్లపై కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆదివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు సిఎం కార్యక్రమం ప్రారంభమవు తుందని చెప్పారు. బహిరంగ సభ, ఆడియన్స్ గ్యాలరీ, పార్కింగ్ తదితర ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. ఎండ తీవ్రత బాగా ఉన్నందున ప్రజలు ఇబ్బంది పడకుండా తాగునీరు, మజ్జిగ పంపిణీ చేయాలన్నారు. ఎస్‌పి దీపిక మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యక్రమానికి పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తామని చెప్పారు. సభకు వచ్చేవారు ఇబ్బంది పడకుండా, వీలైనంత వరకు సభా ప్రాంగణానికి సమీపంలోనే పార్కింగ్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో జెసి మయూర్ అశోక్, డిఆర్‌ఒ ఎం.గణపతి రావు, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ పాల్గొన్నారు.

పోరాట ఫలితమే సామూహిక మరుగుదొడ్లు

సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



సామూహిక మరుగుదొడ్లను ప్రారంభిస్తున్న రెడ్డి శంకరరావు

15 ఏళ్లుగా సిపిఎం, ఐద్వా, కాలనీ అసోసియేషన్ పోరాట ఫలితంగానే రామకృష్ణానగర్‌లో సామూహిక మరుగుదొడ్లు నిర్మించినట్లు సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు తెలిపారు. ఆదివారం నగరంలోని రామకష్ణా నగర్లో సామూహిక మరుగుదొడ్లను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నిధులు మంజూరు చేసి 12 షీట్లు కలిగిన సామూహిక మరుగుదొడ్లు నిర్మించారని, ఆయనకు కాలనీ అసోసియేషన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిరోజూ మరుగుదొడ్ల నిర్వహణ కోసం స్కావింజర్‌ని ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను కోరారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ కార్యదర్శి శాంతమూర్తి, ఐద్వా జిల్లా నాయకులు జగదాంబ, దుర్గా, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

జనసేన కార్యకర్తలపై దాడి అమానుషం

విజయనగరంటౌన్ : బెవరపేటలో జనసేన కార్యకర్తలపై దాడి అమానుషమని జనసేన నాయకులు గురాన అయ్యలు ఖండించారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఆదివారం ఆయన పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా గురాన అయ్యలు మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్తు స్టిక్కర్లు అంటించొద్దని అన్నందుకు జనసేన కార్యకర్తలపై వైసిపి నేతలు బరితెగించి, దాడులు చేయడం అమానుషమన్నారు. పోలీసు శాఖ నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆదాడ మోహన్ రావు, రాజేంద్ర, ఎంటి రాజేష్, భార్గవ్, ఎం.పవన్ కుమార్, సురేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

మోడీ పాలనలో రాజ్యాంగానికి తూట్లు

ప్రచారభేరిలో సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు తమ్మినేని, ఒమ్మి



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి-గజపతినగరం

మోడీ పాలనలో రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు తమ్మినేని సూర్యనారాయణ, ఒమ్మి రమణ ఆగ్రహం వ్యక్తంచేశారు. సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో ప్రచార బేరిలో భాగంగా ఆదివారం గజపతినగరంలోని ఎన్‌జిఒ హోంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.లక్ష్మి అధ్యక్షతన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ మోడీ సర్కారు.. ప్రజాస్వామిక హక్కులను,కాలరాస్తూ, ప్రజలపై భారాలు మోపుతూ ఇబ్బందుల పాల్జేస్తోందని విమర్శించారు. ప్రజా సంక్షేమాన్ని పక్కనపెట్టి అదానీ, అంబానీ లాంటి బడా పెట్టుబడి దారులకు ప్రజాసంపదను కట్టబెడుతోందని దుయ్యబట్టారు. మరోవైపు కార్మిక హక్కులను కాలరాస్తూ లేబర్ కోడ్లు తెచ్చారని, రైతాంగం నడ్డి విడిచారని, ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తున్నారని విరుచుకుపడ్డారు. మహిళా హక్కులపై దాడి చేస్తున్నారని ధ్వజమెత్తారు. మతతత్వాన్ని రెచ్చగొట్టి ప్రజల్ని చీల్చి హక్కులపై దాడి చేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా తీవ్ర ద్రోహం చేశారన్నారు. మోడీని వెంటనే గద్దించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పిలుపునిచ్చారు.

సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ మాట్లాడుతూ ప్రజలు కరోనాతో ఇబ్బందులు పడుతుంటే రక్షించాల్సిన మోడీ ధరలు పెంచి మోసం చేశారని విమర్శించారు. రైతు వ్యతిరేక చట్టాలు తెచ్చారని, ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసగించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీనివాస్, సిపిఎం మెంటాడ మండల కార్యదర్శి రాకోటి రాములు, సిపిఐ నాయకులు గేదెల రామనాయుడు, నూకరాజు, రాము, గురువులు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : ధరలను పెంచి ప్రజలపై భారాలు మోపుతున్న మోడీని గద్దె దించాలని సిపిఎం జిల్లా నాయకులు జగన్ మోహన్ కోరారు. జొన్నగుడ్డి ప్రాంతంలో జరిగిన ప్రచారబేరి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గంజిపేట, కంటోన్మెంట్ ప్రాంతంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ, కొత్తఅగ్రహారం ప్రాంతంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు బి.రమణ ప్రచారం చేశారు. దాసన్నపేట , రాజీవ్‌నగర్ కాలనీలో జగదాంబ, శాంతమూర్తి ప్రచారం నిర్వహించారు.



నిరసన చేపడుతున్న ఉపాధ్యాయులు

అక్రమ సస్పెన్షన్లపై నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని కోట వద్ద పదో తరగతి మూల్యాంకన కేంద్రం వద్ద ఆదివారం సాయంత్రం నాలుగు నుండి ఐదు గంటల వరకు ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి నాయకులు టి.సన్యాసిరాజు ఆధ్వర్యాన ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఉపాధ్యాయులపై సస్పెన్షన్ తక్షణమే ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. బోధనేతర పనుల నుండి ఉపాధ్యాయులకు పూర్తిస్థాయి మినహాయింపు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ (1938) నాయకులు ఈశ్వరరావు, యుటిఎఫ్ నాయకులు డి.రాము, ఆర్.ఈశ్వరరావు, రమేష్ పట్నాయక్, ఎస్‌టియు నాయకులు డి.శ్యామ్, ఎపిటిఎఫ్ (256) నాయకులు షేక్ బుకారిబాబు, పిఆర్‌టియు నాయకులు వి.రామావతారం, ఇతర సంఘాల నాయకులు అమర్‌నాథ్, కంది రమణ, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి జిల్లా కార్యాలయ కార్యదర్శిగా దేవవర్మ

ప్రజాశక్తి-విజయనగరం కోట

టిడిపి జిల్లా కార్యాలయ కార్యదర్శిగా జొన్నవలస గ్రామానికి చెందిన పి.జె.జె.దేవవర్మ (రాజేష్ బాబు)ను నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వులను ఆదివారం స్థానిక అశోక్ బంగ్లాలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు.. దేవవర్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అతిథి గజపతిరాజు, నాయకులు పాల్గొన్నారు.

బంగారం కోసం బంధువే చంపేశాడు

ప్రజాశక్తి-విజయనగరం, కొత్తవలస




వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి దీపిక


కొత్తవలస కుమ్మరివీధిలో ఇటీవల జరిగిన హత్య కేసును ఛేదించి, నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌పి దీపిక వెల్లడించారు. నిందితుడి నుంచి దోచుకున్న బంగారం (34.495 గ్రాములు) వస్తువులను రికవరీ చేసినట్లుగా తెలిపారు. ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

ఎల్.కోట మండలం జమ్మాదేవిపేటకు చెందిన నిందితుడు మాదాబత్తుల కృష్ణ ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు దగ్గరి బంధువు (పెద్దమ్మ) ఇంటికే కన్నం వేయాలని చూశాడు. కొత్తవలస కుమ్మరివీధిలో ఉంటున్న మాదాబత్తుల సూర్యకాంతం ఇంట్లోకి ఈ నెల 15న చొరబడ్డాడు. ఎవరూ గుర్తించకుండా ముఖానికి కర్చీఫ్ కట్టుకొని, తలకు టోపి పెట్టుకొన్నాడు. ఇంటిలో ఇతర కుటుంబ సభ్యులెవరూ లేకపోవడంతో సూర్యకాంతం మెడలోని రెండు పేటల బంగారు పుస్తుల తాడును తెంపేందుకు ప్రయత్నించాడు. ఆమె ప్రతిఘటించి, అతని ముఖానికి ఉన్న కర్చీఫ్ తొలగించి, కృష్ణగా గుర్తించింది. ఇంతలో ఆమె తలపై కత్తిపీటతో విచక్షణారహితంగా కృష్ణ కొట్టడంతో రక్తపు మడుగులో పడిపోయింది. సంఘటనా స్థలంలో ఆనవాళ్లు లేకుండా, పోలీసు జాగిలాలు గుర్తించకుండా కారం తీసి, చల్లాడు. పుస్తుల తాడు, ఒక చెవికిగల ఎత్తు గొలుసును తీసుకుని కృష్ణ పరారయ్యాడు. ఆ నగలను విశాఖపట్నంలో తనఖాపెట్టి, రూ.1.48 లక్షలు తీసుకున్నాడు. పిల్లల స్కూలు ఫీజులు, దుస్తులు, ఇంటికి కొన్ని వస్తువులను కొనుగోలు చేసేందుకు కొంత నగదును కృష్ణ ఖర్చు చేశాడు. అనంతరం నిందితుడు తన భార్య పిల్లలతో అత్తారింటికి వెళ్లి, అక్కడ నుండి విజయవాడ వెళ్లాడు. అనంతరం కూలీ పనుల నిమిత్తం కర్నాటక రాష్ట్రం కొప్పల్‌కు వెళ్లిపోయాడు. నిందితుడు భార్య ఫోను చేసి, మాదాబత్తుల సూర్యకాంతం చికిత్స నిమిత్తం కెజిహెచ్‌లో చేరి, చనిపోయినట్లు, తన పిల్లలకు కూడా ఆరోగ్యం బాగులేదని చెప్పి రమ్మని కోరింది. దీంతో ఎల్.కోట మండలం జమ్మాదేవిపేట కృష్ణ రావడంతో ఆయన్ను పోలీసులు అరెస్టుచేశారు. ఈ కేసులో ఎటువంటి ఆధారాలూ లేనప్పటికీ కొత్తవలస సిఐ ఎస్.బాలసూర్యారావు, సిసిఎస్ సిఐ ఎం.బుచ్చిరాజు సాంకేతిక ఆధారాలను సేకరించి, లాభాపేక్ష హత్యకు పాల్పడిన నిందితుడిగా మాదాబత్తుల కృష్ణను గుర్తించి, అరెస్టు చేసినట్లుగా ఎస్‌పి వివరించారు. ఈ కేసులో క్రియాశీలకంగా పని చేసిన అధికారులు, సిబ్బందిని అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేశారు. సమావేశంలో ఇన్‌ఛార్జి డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, కొత్తవలస సిఐ ఎస్.బాలసూర్యారావు, ఎస్‌బి సిఐ జి.రాంబాబు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేదు

- నిలకడగా భూగర్భ జలాలు
- సమస్య ఉత్పన్నమైతే 24 గంటల్లో పరిష్కారం
- రూ.701 కోట్లతో జలజీవన్ మిషన్ పనులు.. త్వరలో టెండర్లు
- 'ప్రజాశక్తి'తో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఉమాశంకర్ ముఖాముఖి





జిల్లాలో నీటి ఎద్దడి లేదని, భూగర్భ జలాలు నిలకడగా ఉన్నందున ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా గ్రామీణ నీటిసరఫరా శాఖ ఎస్ఇ ఉమాశంకర్ తెలిపారు. ఎక్కడైనా తాగునీటి సమస్యలు ఉత్పన్నమైతే తమ దృష్టికి వచ్చిన 24 గంటల్లో పరిష్కారం చూపుతున్నామని వెల్లడించారు. చేతిబోర్లు, సిపిడబ్ల్యు, సింగిల్ విలేజ్ స్కీములన్నీ పనిచేస్తున్నాయని చెప్పారు. జిల్లాలో సుమారు రూ.701 కోట్ల జలజీవన్ మిషన్ నిధులతో 1300 పనులు చేపట్టనున్నామని వివరించారు. వేసవి ప్రణాళిక, తదితర అంశాలపై ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ 'ప్రజాశక్తి'కి ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు....

\- ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

జిల్లాలో ఏయే పథకాల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు?.

తాగునీటి బోర్లు దాదాపు అన్ని గ్రామాల్లోనూ అందుబాటులో ఉన్నాయి. ఇవి కాకుండా సింగిల్ విలేజ్ పథకాలు, సిపిడబ్ల్యు స్కీమ్స్ (మల్టీ విలేజ్, ఒక గ్రామం కన్నా ఎక్కువ గ్రామాలకు తాగునీరు అందించేవి) ఉన్నాయి. వీటిలో చాలా వరకు నదులు, భూగర్భ జలాల ఆధారంగా ఉన్నాయి.

జిల్లాలో ఎన్ని చేతిబోర్లు ఉన్నాయి? వాటి నిర్వహణ ఎలా ఉంది?.

జిల్లా వ్యాప్తంగా 14,483 బోర్లు ఉన్నాయి. వీటిలో వేసవి నేపథ్యంలో ఇటీవల 906 బోర్లు మరమ్మతులు చేపట్టాం. మరో 28 బోర్లకు ఇంకా మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. వాటిని కూడా త్వరలోనే పూర్తిచేస్తాం. ఇందుకు నిధుల సమస్య కూడా పెద్దగా లేదు. మిగిలిన బోర్లకు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం లేదు.

తాగునీటి పథకాల నిర్వహణకు నిధులు ఎలా సమకూరుతున్నాయి?.

నిధులన్నీ స్థానిక సంస్థల ద్వారానే సమకూరుతాయి. సాధారణంగా తాగునీటి పథకాల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే ఆర్థిక సంఘం నిధుల నుంచి ఖర్చుచేశారు. బోర్ల నిర్వహణకు అయ్యే ఖర్చు మండల పరిషత్తు భరిస్తుంది. సింగిల్ విలేజీ స్కీమ్‌కు గ్రామ పంచాయతీలు, సిపిడబ్ల్యు స్కీములకు జిల్లా పరిషత్తు నిధులు కేటాయిస్తాయి. మా శాఖ తరపున నిర్వహణ బాధ్యత చూస్తాము. అన్ని చోట్లా ఇంజినీర్లు, సిబ్బంది తగినంతగానే ఉన్నారు.

నీటి ఎద్దడి ఉత్పన్నమైనప్పుడు ఎవరిని ఎలా సంప్రదించాలి?.

వేసవి నేపథ్యంలో జిల్లా కేంద్రంలో మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేశాం. 9100120711 ఫోన్ నంబర్ ద్వారా ఈ కేంద్రంలోని సహాయకులను సంప్రదించవచ్చు. వెంటనే సంబంధిత ఇంజినీర్లకు ఇక్కడి నుంచి ఆదేశాలు జారీచేస్తాం. సకాలంలో సమస్య పరిష్కారం కావడానికి వీలు కలుగుతుంది. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మానిటరింగ్ సెల్ అందుబాటులో ఉంటుంది.

వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యలేమైనా మీ దృష్టికి వచ్చాయా?.

నీటి కొరత వల్ల ఎక్కడా సమస్యలు రాలేదు. కొన్నిచోట్ల సాంకేతిక సమస్యల వల్ల ఇటీవల సరఫరాలో ఆటంకం కలిగిన మాట వాస్తవమే. ఇవి కూడా స్థానికుల నిర్వహణ లోపం వల్ల జరిగిన చిన్నచిన్న తప్పిదాలే. వాటిని కూడా ఏరోజుకారోజు పరిష్కరించాం. ప్రస్తుతం గిరిజన ప్రాంతం సహా ఎక్కడా తాగునీటి సమస్య ఉందన్న మాట లేదు.

ఇటీవల కాలంలో ఎక్కడెక్కడ సాంకేతిక సమస్యలు ఉత్పన్నమయ్యాయి?.

దత్తిరాజేరు మండలం ఇంగిలాపల్లి, సరాయివలస, కొండదారపల్లిలో నీటి పంపిణీలో కొన్ని సమస్యలు ఏర్పడ్డాయి. అక్కడ నీరు లేక కాదు. ఇంగిలాపల్లి, సరాయివలసల్లో పైపులైన్ల లీకేజీ వంటి సమస్యలు ఉత్పన్నం కావడం వల్ల కొంత ఇబ్బంది ఏర్పడింది. కొండదారపల్లిలో పైపుల్లో ముచ్చులు పేరుకుపోయాయి. దీంతో పంపింగ్ సమస్య ఉత్పన్నమైంది. మాకు తెలిసిన వెంటనే వీటన్నింటినీ పరిష్కరించాం.

ఈ ఏడాది పెద్దగా నీటి సమస్య లేకపోవడానికి కారణం ఏమిటి?.

గత నెలలో కురిసిన వర్షాల వల్ల చెరువులు నిండాయి. నదులు ఇంకిపోకుండా ఉన్నాయి. దీంతో, భూగర్భ జలాలు నిలకడగా ఉన్నాయి. భూగర్భ జలశాఖ ఇచ్చిన తాజా నివేదిక ప్రకారం జిల్లాలో సగటున 5 మీటర్ల నుంచి 7 మీటర్లలోపే భూగర్భ జలాలు ఉన్నాయి. ఇది ఆ శాఖ చేసిన ర్యాండమ్ సర్వే రిపోర్టు.

జల జీవన్ మిషన్ పనులు ఎంతవరకు వచ్చాయి?.

ఇంటింటికీ కొళాయి ద్వారా నీరందించే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో జలజీవన్ మిషన్ పథకం రూపొందించారు. మొదటి విడతలో చేపట్టిన పనుల్లో సగానికి పైగా పూర్తయ్యాయి. రెండో విడతలో రూ.701 కోట్లతో 1300 పనులు చేపట్టాల్సి ఉంది. దీనికి సంబంధించి త్వరలో టెండర్లు పిలిచేందుకు అవకాశం ఉంది. ఈ పథకం పూర్తిగా అందుబాటులోకి వస్తే ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా నీరందుతుంది.


ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

యాతపాలెం కొండపై రగడ

గ్రావెల్ తవ్వకాలపై గ్రామస్తుల ఆందోళన

జామి : మండలం లోని భీమసింగి పంచా యతీ యాతపాలెం కొండపై రగడ నెలకొంది. గ్రీన్ ఫీల్డ్ హైవే పనుల్లో భాగంగా యాతపాలెం కొండపై గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నారు. ఈ తవ్వకాలను గ్రామ స్తులు అడ్డుకోవడంతో ఆదివారం అక్కడ గందరగోళం నెలకొంది. ఇప్పటికే కొండను పూర్తిగా తవ్వి తరలించారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామస్తులంతా కొండపై పశువులు మేపుకోవడంతోపాటు దానిపై ఆధార పడి జీవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి నామ మాత్రంగా అనుమతులు తీసుకుని, భారీగా తవ్వకాలు నిర్వహిస్తున్నారని, దీని వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందని చెప్పారు. పోలీసులను అడ్డం పెట్టుకుని భయపెట్టాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. దీనిపై ఇప్పటికే జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశామని, సోమవారం మరోసారి కలెక్టర్, ఎస్‌పిని కలిసి జరుగుతున్న అక్రమాన్ని వివరిస్తామని తెలిపారు.

ఆంగ్లభాష నైపుణ్యాలు అందరికీ అవసరం

శృంగవరపుకోట : ప్రస్తుత ప్రపంచంలో ఆంగ్లభాష నైపుణ్యాలు అందరికీ అవసరమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన ప్రపంచ ఆంగ్ల భాష దినోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచంలో అధిక సంఖ్యలో మాట్లాడే భాష మాండారిన్ అయినప్పటికీ అది కేవలం చైనా ఒక్క దేశానికే పరిమితమన్నారు. ఆంగ్లభాష మాత్రం ప్రపంచంలో దాదాపు అన్ని దేశాలలో విస్తరించి ఉందన్నారు. ఆంగ్ల భాషా పరిజ్ఞానం ఉన్నవాడు ప్రపంచంలో ఏ మూల నైనా నెగ్గుకు రాగలడని, శాస్త్ర, సాంకేతిక రంగాలలో, వాణిజ్యం, టూరిజం, ఇంటర్ నెట్‌లో ఇలా అన్ని రంగాలలో ఆంగ్ల భాష మిగిలిన భాషలన్నిటికన్నా అత్యధిక శాతం వినియోగంలో ఉందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ రమేష్ కుమార్ ఉద్యోగ సాధనలో విజయం సాధించడంలో ఆంగ్ల భాషకున్న ప్రాముఖ్యతను తెలిపారు. కాగా వక్తలందరూ ఆంగ్లంలోనే ఉపన్యాసించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వాసుదేవరావు, ఈరన్న, భాస్కర్, వలీ ఖాన్, శ్రీ లక్ష్మి, సంధ్యా రాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

కెంగువలో పారిశుధ్య పనులు

గజపతినగరం : మండలంలోని కెంగువలో ఆదివారం పారిశుధ్య పనులు చేపట్టారు. పనులను సర్పంచ్ కె.సూరప్పుడు, వైసిపి యువ నాయకులు లెంక గణేష్‌లు దగ్గరుండి పర్యవేక్షించారు. మురుగు కాలువలను శుభ్రపరిచి, పిచ్చి మొక్కలను తీసివేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్యం నిర్మూలన దిశగా కృషి చేస్తున్నామని అందుకు గాను కొత్తగా కాలువలు నిర్మించటం జరుగుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు పారిశుధ్యం పై దృష్టి పెట్టాలని కోరారు.

చంద్రబాబుపై దాడి అమానుషం

నెల్లిమర్ల : ప్రతి పక్ష నేత చంద్రబాబుపై దాడి అమానుషమని, అధికార వైసిపి రౌడీ తనానికి నిదర్శనమని టిడిపి ఎస్‌సిసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న అన్నారు. ఆదివారం ఆయన తంగుడుబిల్లిలో విలేకర్లతో మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో పర్యటిస్తున్న చంద్రబాబుపై మంత్రి ఆదిమూలపు సురేష్ దాడి చేయించడం సిగ్గుచేటన్నారు. ఇన్నాళ్లుగా దళితులపై దాడులు జరుగుతున్నా నోరుమెదపని మంత్రి ఇప్పుడు చంద్రబాబుపై దాడి చేయడం చేతకాని తనంగా భావిస్తున్నామన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 27 దళిత పథకాలను రద్దు చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని ఎద్దేవా చేశారు. 1200ఎకరాల దళితుల భూములను బలవంతంగా లాక్కున్నారని, ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు రూ. 33వేల కోట్లు దారి మళ్లించి దళితులు, ఎస్‌టిలకు ద్రోహం చేశారన్నారు.


రేగిడి: పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ బుచ్చిరాజు

గురుకులాల ప్రవేశ పరీక్ష ప్రశాంతం

రేగిడి : మండలంలోని ఉంగరాడమెట్ట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఐదు, ఇంటర్ ప్రవేశాలకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9 గంటలకు 5వ తరగతి ప్రవేశ పరీక్షకు 111 మంది హాజరు కాగా, మధ్యాహ్నం 2 గంటలకు ఇంటర్ ప్రథమ సంవత్సరానికి 102 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ బుచ్చిరాజు తెలిపారు. ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ ప్రశాంతంగా జరిగినట్లు వెల్లడించారు. విద్యార్థులకు అవసరమైన రూములు, ఫ్యాన్లు, తాగునీరు అన్ని రకాల సదుపాయాలూ చేశామన్నారు.

వేపాడ: గురుకుల పాఠశాలల్లో జరిగిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం జరిగిన 5వ తరగతి ప్రవేశ పరీక్షకు 184 మంది దరఖాస్తు చేసుకోగా 144 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్ష కు 72 మంది విద్యార్థులు పరీక్షలకు దరఖాస్తు చేసుకోగా 67 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ యు. ఉషారాణి తెలిపారు.

నిరాశ్రయులకు అండగా ఉత్తరాంధ్ర విద్యార్థిసేన

గరివిడి : నిరాశ్రయులకు అండగా ఉత్తరాంధ్ర విద్యార్థి సేన ఉంటోందని ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సుంకరి రమణమూర్తి అన్నారు. చీపురుపల్లిలోని రుంకాణ వీధిలో జరిగిన అగ్నిప్రమాదంలో నాలుగు ఇళు కాలిపోయిన సంగతి తెలిసిందే. విషయం తెలుసుకున్న రమణమూర్తి ఆదివారం ఘటనాస్థలానికి చేరుకుని అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన నాలుగు కుటుంబాల సభ్యులను పరామర్శించారు. అనంతరం స్థానిక వైసిపి మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం చేతుల మీదుగా నిత్యవసర సరుకులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఏ రకమైన ప్రకృతి వైపరీత్యం తలెత్తినా ఉత్తరాంధ్ర విద్యార్థి సేన తనవంతు సహా సహకారాలందిస్తోందన్నారు. అందులో భాగంగా ఇవాల ఇక్కడికి వచ్చి హితోధికంగా సహాయం చేయడం జరిగిందన్నారు. ఈ సంఘటన తరువాత స్థానిక ప్రజలు, మండల నాయకులు బాధితులకు సహాయం చేయడంలో స్పందించిన తీరు అభినందనీయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకుడు మంత్రి వెంకట రమణ, గేదెల సత్యన్నారాయణ, స్థానిక ఎంపిటిసి తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

విజయనగరం టౌన్ : అంజనీ పుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు త్యాడ రామకృష్ణారావు ఆధ్వర్యంలో స్థానిక కామాక్షి నగర్, అయ్యన్న పేట జంక్షన్ వద్ద ఆదివారం మజ్జి చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. దీనిని వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ - 102 గవర్నర్ కర్రోతు సత్యం ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఎ.ఎస్.ప్రకాశరావు, గౌరవ సలహాదారు ఎ.తిరుపతిరావు, ఉపాధ్యక్షులు పిడుగు సతీష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి లోపింటి కళ్యాణ్, పాల్గొన్నారు.

స్థానిక ఎత్తు బ్రిడ్జి డౌన్, వైజాగ్ రోడ్డులో ఆంజనేయ స్వామి గుడి దగ్గర ఆదివారం మేమున్నాం సంస్థ ఆధ్వర్యంలో మజ్జిగ పాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలి ప్రతాప్, మేమున్నాం సభ్యులు పాపారావు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

పూసపాటిరేగ : మండలంలోని పసుపాం గ్రామానికి చెందిన గుడాల లక్ష్మీ నాయుడు (40) పురుగులు మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. మృతుడు స్థానిక విజయనగరం బయోటెక్ పరిశ్రమలో ఎన్‌ఎంఆర్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. మద్యానికి బానిసై అప్పులతో మానసికంగా కుండిపోయాడు. దీంతో గత నెల 27న పురుగుమందు తాగాడు. కుటుంబీకులు వెంటనే విజయనగరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చిక్సిత పొందదుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆయన తమ్ముడు గుడ్డల కన్నయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూ రీసర్వేతో అక్రమాల నిగ్గు తేలేనా?

- భూ అక్రమాల కేరాఫ్‌గా కిల్తం పాలెం
- రూ.50 కోట్ల విలువైన ప్రభుత్వ భూముల ఆక్రమణ
- 90 శాతం చెరువు గర్భాలూ పంట పొలాలుగా మారిన వైనం


గతంలో 70 అడుగుల విస్తీర్ణంలో ఉండే చిలకల గెడ్డ కాలువ ఇప్పుడు ఇలా పిల్ల కాలువలా దర్శనమిస్తోంది...

ప్రజాశక్తి - శృంగవరపుకోట

పంట పొలాల సాగుకు చెరువులే ప్రధాన ఆధారం. అటువంటి విలువైన చెరువు గర్భాలు, నీటిని రైతు పొలాలకు అందించే కాలువలు ఒక్కొక్కటిగా ఆక్రమణదారుల చెరలోకి వెళ్ళిపోతున్నాయి. అడ్డుకోవాల్సిన అధికారులే చూసీ చూడనట్లు వ్యవహరించడంతో అక్రమార్కులకు అడ్డూ అదుపూ లేకుండా పోతుంది. ఈ తరుణంలోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన శాశ్వత భూహక్కు భూ రక్ష పథకం ద్వారా ప్రభుత్వ భూములకు రక్షణ లభిస్తుందని ప్రభుత్వం చెబుతున్నా మండలంలో రెండు దశల్లో ఇప్పటివరకు జరిగిన సమగ్ర భూ సర్వేలో వెల్లడైన భూ లోపాలు లోపాయ కారకంగానే ఉంచడంతో రెవెన్యూ అధికారుల తీరుపై సర్వత్ర విమ ర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం ఆక్రమణలకు అడ్డాగా ఉన్న కిల్తం పాలెంలో జరుగుత్ను సర్వేతోనైనా ఆక్రమణలు భయ టపడితే బాగుంటుందని రైతులు ఎదురుచూస్తున్నారు.

మండలంలోని చెరువు గర్భాలు, కాలువలు అధిక శాతం ఆక్రమణలు కలిగిన కిల్తం పాలెం రెవెన్యూ పరిధిలో సమగ్ర భూ సర్వే జరిగి శాశ్వత భూ హక్కు లభించేనా అని కొంత మంది ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే ఈ రెవెన్యూలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములు పై పలుదపాలు స్పందనలో ఫిర్యాదులు చేసినా, చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులు ఆదేశించినా స్థానిక అధికారుల చర్యలపై చలనం కానరాక పోవడంతో ఈ భూ సర్వేలో ప్రభుత్వ భూములకు రక్షణ కలిగేనో లేదో అని పలువురు చెరువుల పరిరక్షణ దారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎటువంటి సమాచారమూ లేదు..

గ్రామాలలో సమగ్ర భూ సర్వే నిర్వహిస్తున్నారన్న సమాచారం తెలీదు. బహుశా ఈ సర్వే విషయం అధికారులు, నాయకుల మధ్య గోప్యంగా నడుస్తుంది. శాశ్వత భూ సర్వే చేసే గ్రామంలో ముందు రోజు దం డోరా వేయించాలి.

రాయివానిపలెం, గ్రామ రైతులు

కనుమరుగైన చెరువులు ఈ సర్వేలో కనిపిస్తాయా..?

కిల్తంపాలెం పంచాయతీ పరిధిలో 42 చెరువులు, బంధలలో 90 శాతం ఆక్రమణలలో ఉన్నాయి. ఉదాహరణకు.. భర్తాపురం గ్రామంలో సర్వేనెంబర్ 22లో మూడు ఎకరాల విస్తీర్ణం గల ఎర్రబంద పూర్తిగా ఆక్రమణలకు గురై కనుమరుగైంది. గౌరీపురం సమీపంలో కొక్కిరిబంద ఎక్కడుందో ఎవరూ చెప్పలేకపోతున్నారు. భర్తా పురం గ్రామ సమీపంలో సర్వేనెంబర్ 68.9లో చిలకల గడ్డ కాలువ అసలు కనిపించని స్థితిలో ఉంది. మిగతా ప్రాంతాలలో కూడా పూర్తిగా ఆక్రమణలతో కుచించుకుపోయింది. అంబాదాసు పాలెం వద్ద పొట్టి బంద, రాయివానిపాలెం సమీపంలో పిల్లివాని చెరువు, కూర్మయ్య చెరువు, భర్తపురం దొర్లపాలెం వద్ద సర్వే నంబర్ 107లో 6.15 ఎకరాల విస్తీర్ణం గల అల్లంవాని చెరువు ఆక్రమణలతో ఆన వాళ్లు లేకుండా పోయాయి. ఈ చెరువులో మామిడి తోటలతో పాటు పక్క ఇల్లను కూడా నిర్మించుకున్నారు. ఇలా చెప్పుకుంటే పోతే చాంతాడంట ఉంటుంది. మరి సమగ్ర భూ సర్వేలో అక్రమాల నిగ్గు తేలనో లేదో వేచి చూడాల్సిందే.


4.5 ఎకరాలుండే పిల్లవాని చెరువు ఇప్పుడు రెండెకరాలే ఉంది..


సర్వే చేస్తున్న రెవెన్యూ బృందం

అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయవచ్చు

మండలంలోని రెండు దశల్లో ఇప్పటి వరకు 37 గ్రామాల్లో భూ రీసర్వేలను పూర్తి చేసాం. మూడో దశ సర్వే కిల్తం పాలెం రెవెన్యూ పరిదిలో మొదలైంది. ముందుగా ప్రభుత్వ భూములకు సంబంధించి బౌండరీలను గుర్తించి ఫిక్స్ చేయటం, గ్రామ సరిహద్దులను గుర్తించి ఆధునిక సాంకేతిక టెక్నాలజీతో డేటా ఎంట్రీ చేయటం, భూమి పూర్తి రికార్డులను ఆన్ లైన్ చేయటం, ప్రభుత్వ భూములు, ప్రైవేటు భూములు, గ్రామీణ హెబిటేషన్ ఫిక్స్ చేసి జియో కొర్డి నెట్ అనుసంధానం చేయడం జరుగుతుంది. సమగ్ర భూ సర్వే పై ఎటువంటి అభ్యంతరాలు ఉన్న దరఖాస్తు చేసుకోవచ్చు. పాత రికార్డులో ఉన్న లోపాలను సరి చేస్తాం. అదనంగా భూమి ఉన్నట్లు గుర్తిస్తే యజమాని లేదా కుటుంబ సభ్యుల నుంచి నిరభ్యంతర పత్రాలు సేకరించి ఆ భూమి ఎవరికి చెందితే వారికి కేటాయిస్తాం. చెరువులు, కాలువలు, గెడ్డలు ప్రభుత్వానికి చెందిన సెంటు భూమి కూడా ఆక్రమణ పాలు కాకుండా నివేదికలు తయారు చేస్తాం.

శ్రీనివాసరావు, తహశీల్దార్, శృంగవరపుకోట

ఆ సచివాలయంలో ఇద్దరే ఉద్యోగులు

- అందులో ఒకరికి ఇన్‌ఛార్జిగా బాధ్యతలు
- వారంలో మూడు రోజులు అందుబాటులో ఉండేది ఒక్కరే

ప్రజాశక్తి- డెంకాడ

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. ఈ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగుటికే ప్రభుత్వ సేవలను అందించి వచ్చనే ఉద్దేశ్యంతో ప్రవేశపెట్టారు. ప్రతి 2వేల జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేశారు. ఆ సచివాలయానికి సుమారుగా ఐదు నుంచి పదిమంది వరకు సచివాలయ ఉద్యోగస్తులను ఏర్పాటు చేశారు. దీంతో సచివాలయ పరిధిలో ఉన్న ప్రజలు చాలా సంతోషం వ్యక్తం చేశారు. పనులు నిమిత్తం మండల కార్యాలయాలు చుట్టూ తిరగాల్సిన పనిలేదని మన గ్రామంలో మన కళ్ళముందే మన పనులు చేసుకోవచ్చునని ప్రజలు ఎంతో సంతోషించారు. అయితే సచివాలయ సిబ్బంది మాత్రం ప్రజలకు సేవలు అందించడంలో విఫలమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సచివాలయ సిబ్బంది ఎవరికి వారే యమునా తీరుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. సచివాలయాలు రాకముందే అనుకున్న విధంగా పనులు జరిగేవని, ఇప్పుడు ఈ సిబ్బంది ప్రజలకు సంబంధంచిన పనులు చేయడం లేదని ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


విధుల్లో ఉన్న ఇద్దరు ఉద్యోగులు

మండలంలోని గొలగాం, గంట్లం, బంగార్రాజుపేట గ్రామాలను కలుపుకొని గొలగాంలో సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ సచివాలయం పరిధిలో ముగ్గురు గ్రామ కార్యదర్శులు మరో ఏడుగురు సచివాలయ సిబ్బందిని నియమించారు. మొత్తం పది మంది సిబ్బందిలో ప్రస్తుతం మహిళా పోలీసు, అగ్రికల్చర్ అసిస్టెంట్ వీరిద్దరే ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. కాగా అగ్రికల్చర్ అసిస్టెంట్‌ని గుణుపూరుపేట సచివాలయానికి ఇంచార్జిగా వేశారు. దీంతో ఇక్కడొక రోజు అక్కడొక రోజు విధులు నిర్వహిస్తున్నాడు. కార్యదర్శులు ముగ్గురూ ఒకేసారి ట్రైనింగ్‌కి పేరిట నెల రోజులు క్రితం వెళ్లిపోయారు. వీరికి ఆరు నెలల ట్రైనింగ్ ఉంటుంది. మిగిలిన ఇంజనీరింగ్ అసిస్టెంట్ జాయిన్ అయిన వెంటనే రిజైన్ చేసేసారు. సర్వేయరు ట్రైనింగ్‌లో ఉన్నారు. డిజిటల్ అసిస్టెంట్ మొదటి నుంచి రావడం లేదు. వెల్ఫేర్ అసిస్టెంట్ కూడా రిజైన్ చేశారు. యానిమల్ అసిస్టెంట్ కూడా సెలవు పెట్టి వెళ్లిపోయాడు. వీరి బాధ్యతలను గ్రామ కార్యదర్శులు చూస్తుండేవారు. వారు కూడా ప్రస్తుతం ట్రైనింగ్‌కు వెళ్లిపోడంతో ఇక్కడే ఇద్దరే విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో ప్రజలకు సకాలంలో సేవలు అందడంలేదు. ఈ ఇద్దరిలో ఒక్కరే రోజూ విధులకు హాజరవుతున్నారు. మిగిలిన వ్యక్తికి ఇంఛార్జి బాధ్యతలు ఉండటం వల్ల ఇక్కడకు రెండు రోజులకు ఒక్కసారే వస్తున్నారు. అయితే ఈ సచివాలయంపై పర్యవేక్షణా లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. అందుకే సచివాలయ సిబ్బంది ఎవరికి వారే యమునా తీరుగా పనిచేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు సచివాలయాలపై దృష్టి పెట్టి ప్రజలకు సేవలు అందేటట్టు చేయాలని కోరుతున్నారు.



అధికారులను సత్కరిస్తున్న గ్రామస్తులు

అధికారులకు సన్మానం

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని బుడతనపల్లి ప్రగతి రైతు ఉత్పత్తి దారుల సంఘం కార్యాలయంలో ఆదివారం అధికారులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. రిటైర్డ్ ఫారెస్ట్ చీఫ్ కన్సర్వేటర్ రామ్మోహరావు, సోషల్ ఫారెస్టు రిటైర్డ్ డిఎఫ్ఒ జానకీరావులను గ్రామానికి చెందిన తాటిపూడి దాలిరాజు, సింహాద్రి, సన్యాసి, సోములు, త్రిమూర్తులు, ఎస్‌సి, ఎస్‌టి పేదలు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి. రాంబాబు, సుదీర్, దేవుడు, అప్పారావు, రవి, మహేష్ తదితరులు సన్మానించారు. 2002 నుండి 2022వరకు గ్రామాభివృద్ధి, చెట్లు, ఉపాధి, అవకాశాలు కల్పించటానికి వారు చేసిన సహకారాన్ని ఈ సందర్భంగా కొనియాడారు. తమ సేవలను గ్రామస్తులు మర్చిపోలేరని చెప్పారు.

టిడిపి హయాంలోనే అభివృద్ధి

ప్రజాశక్తి- గరివిడి

చీపురుపల్లి నియోజకవర్గంలో ప్రజలు అవస్థలు తీర్చడానికి, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి కృషి చేసిన ఘనత మాజీ మంత్రి కిమిడి మృణాళినికి దక్కుతుందని నియోజకవర్గం టిడిపి ఇంఛార్జి కిమిడి నాగార్జున అన్నారు. చీపురుపల్లి ప్రభుత్వాసుపత్రి, ఆదర్శ డిగ్రీ కళాశాల వద్ద ఆదివారం ఆయన సెల్ఫీ ఛాలెంజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ పాత గవిడివీధిలో ఉన్న ఆసుపత్రి పాత భవనాల్లో, అసౌకర్యాలు మధ్య వైద్యానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడేవారన్నారు. ఈ నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆసుపత్రిని చీపురుపల్లి- గరివిడి పట్టణాల మధ్య విజయనగరం- పాలకొండ ప్రధాన రహదారి ఆనుకొని మార్కెట్ యార్డ్ కు సంబంధించి సువిశాల ప్రాంగణంలో రూ.3.80 కోట్లతో నూతన భవనాన్ని నిర్మించి, అక్కడికి ఆసుపత్రిని తరలించామన్నారు. భవిష్యత్తులో ప్రజలకు మరెన్నో సేవలు విస్తరింప చేసే విధంగా అవసరమైన మొత్తం స్థలాన్ని ఆసుపత్రికు కేటాయించి, మార్కెట్ యార్డ్‌ను అగ్నిమాపక కేంద్రం వెనుక ఉన్న అతి విలువైన ప్రభుత్వ స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. దీంతో దశాబ్దాలు కాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారమైందన్నారు. విద్యార్థులకు ఉపయోగపడేలా చీపురుపల్లి- గరివిడి పట్టణాల మధ్య విజయనగరం పాలకొండ ప్రధాన రహదారి అనుకొని రూ.12 కోట్లతో ఆదర్శ డిగ్రీ కళాశాల, బాలుర, బాలికల వసతి గృహాల నిర్మాణాన్ని చేపట్టిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికి, నా తల్లి మాజీ మంత్రి కిమిడి మృణాళినికి దక్కుతుందన్నారు. అప్పట్లో డిగ్రీ కళాశాల నిర్మాణానికి ప్రభుత్వ స్థలం సరిపడక పోతే మాజీ మంత్రి మృణాళిని చొరవ చూపి శ్రీరామ కళాశాలకు చెందిన నాలుగున్నర ఎకరాల స్థలాన్ని కేటాయింపు చేసి మొత్తం 10 ఎకరాల్లో ప్రధాన రహదారికి ఆనుకని కళాశాలను నిర్మించి రెండు పట్టణాలకు మణిహారంగా తయారు చేశామన్నారు. ఈ కళాశాల నిర్మాణంతో ఈ ప్రాంతమంతా అభివృద్ధికి నాంది పలికిన ఘనత తమకు దక్కుతుందన్నారు. గత ప్రభుత్వంలో నియోజవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపించామన్నారు. ఆసుపత్రి, డిగ్రీ కళాశాల అభివృద్ధికి గత నాలుగేళ్లలో మీరు చేసిన అభివృద్ధి ఏమిటని మంత్రి బొత్స సత్యనారాయణకు ఆయన బహిరంగ సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రౌతు కాము నాయుడు, పైల బలరాం, దన్నాన రామ చంద్రుడు, సారేపాక సురేష్ బాబు, శనపతి శ్రీను, రౌతు నారాయణ రావు, గవిడి నాగరాజు, అరతి సాహు, సబ్బి సోనియా గడే సన్యాసప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.


సెల్ఫీ చాలెంజ్ చేస్తున్న కిమిడి నాగార్జున

తాడమ్మ తల్లిని దర్శించుకున్న జెడ్‌పి చైర్మన్, ఎమ్‌పి

మెరక ముడిదాం: మండలంలోని గర్భాం మేజర్ పంచాయతీ గ్రామ దేవత తాడమ్మ తల్లిని ఆదివారం జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ దర్శించుకున్నారు. గ్రామంలో ఉన్న అమ్మవారి ప్రతిమల వద్దకు వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. కాగా సోమవారం నుంచి జరగనున్న ఉత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా జాగ్రత్తగా పండగ చేసుకోవాలని సూచించారు.


మొక్కులు తీర్చుకుంటున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

ఉచిత మంచినీటి సరఫరాకు ధీర సాయం

మండలంలోని గర్భాం, పరిసర గ్రామాల్లో తాడమ్మ తల్లి గ్రామదేవద నేపథ్యంలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ధీరా సేవా సంస్థ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నాలుగు వాటర్ ట్యాంకర్లను ఆదివారం డాక్టర్ బొత్స సందీప్ ఆ గ్రామానికి పంపించారు. ధీర ఫౌండేషన్, సత్య డిగ్రీ అండ్ పీజీ కాలేజ్, సీతం కాలేజ్ సంయుక్తంగా ఈ వాటర్ ట్యాంకర్లను పంపించారు. ధీర ఫౌండేషన్ సభ్యుల ద్వారా వీటిని గ్రామ పెద్దలకు, నాయకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రేగుల వినోద్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహభరితంగా ఎడ్ల పరుగు ప్రదర్శన

వేపాడ: మండలంలోని దబ్బిరాజుపేట గ్రామంలో దుర్గాలమ్మ పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎడ్ల పరుగు ప్రదర్శన ఉత్సాహ భరితంగా సాగింది. ఈ పోటీల్లో 20 ఎడ్ల బళ్ళు పాల్గొని తలబడ్డాయి. విజేతలకు పెద్దలు చేతులు మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

గుడిపాలలో గుర్రపు పోటీలు

మండలంలోని గుడిపాల గ్రామంలో నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన గుర్రపు పోటీలు ఆకట్టుకున్నాయి. 10 గుర్రాలు పోటీల్లో పాల్గొని తలబడ్డాయి. విజేతగా నిలిచిన గుర్రపు యజమానులకు గ్రామ పెద్దల చేతుల మీదుగా నగదును బహుమతులు అందించారు.


గుర్రం, ఎడ్ల బళ్ల పోటీలు

'ఉపాధి' కల్పించాలని నిరసన

- అంబేద్కర్ విగ్రహానికి వినతినిచ్చిన దళితులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఉపాధి హామీ పనుల్లో దళితులు, ఎస్‌టిలు, వికలాంగులకు పనులు కల్పించడంలేదని, తమపై వివక్షత చూపిస్తున్నారని గుషిని గ్రామానికి చెందిన దళితులు, ఎస్‌టిలు, వికలాంగులు స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం నిరశన వ్యక్తం చేసి విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లడుతూ గత కొన్ని రోజులుగా గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో తమకు అవకాశం కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పనులు కల్పించడం లేదని అధికారుల దృష్టికి తీసుకు వెళ్ళినా పట్టించుకోవడం లేదని, మిగతా సామజిక వర్గాలకు పనులు కల్పిస్తున్నారని ఆరోపించారు. గ్రామంలో 100 దళిత, ఎస్‌టి, వికలాంగ కుటుంబాలున్నాయని వారంతా ఉపాధి హామీ పనులు చేసుకుంటు జీవిస్తున్నారని తమకు అర్ధాంతరంగా పనులు లేవని చెబితే ఎలా జీవించాలని ప్రశ్నించారు. కాగా పనుల్లో కూడా కుల వివక్ష చూపించి అవమాన పరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించింది ఉపాధి హామీ పనుల్లో తమకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అలకాని పక్షంలో తీవ్ర ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత, ఎస్‌టి, వికలాంగులు కనిగిరి శ్రీని వాసరావు, ఎండ పార్వతి, బంకపల్లి మారయ్య, బంకపల్లి సత్య వతి, బంకపల్లి నారాయణ, చందక సీతయ్యమ్మ, బంక పల్లి పైడి రాజు తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న బాధితులు

పంట కాలువను కప్పేస్తున్నా పట్టించుకోరా..?

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని ధర్మవరం గ్రామంలోని కోమటి చెరువు నుంచి సుమారు 50 మంది రైతుల భూములకు నీరు వెళ్లే పంట కాలువను ముల్లువలస ప్రదీప్ కుమార్ అనే వ్యక్తి మట్టితో కపివేస్తున్నాడని, వెంటనే తొలగించే చర్యలు చేపట్టాలని కోరుతూ రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్ అధికారులకు రైతులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు. రైతు అల్లు రవి, రామకృష్ణ ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ కాలువను మట్టి వేసి కప్పేస్తున్నాడని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ స్పందన కార్యక్రమంలో రెవెన్యూ అధికారులకు, విఆర్వోకు ఇటీవల ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా వదిలేయడంతో మరింతగా మట్టిని తీసుకుని వచ్చి పంట కాలువను పూర్తిగా కప్పివేసే పనికి పూనుకున్నాడని తెలిపారు. పైపెచ్చు చెరువు ఉన్నప్పటి నుండి ఉన్న కాలువను కొత్తగా తీసినట్టు ఆ వ్యక్తి చెబుతుండటం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు అధికారులు పంట కాలువను కప్పెసేందుకు వేస్తున్న మట్టిని తొలగించే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. లేనిపక్షంలో 50 మంది రైతుల భూములకు కాలువ ద్వారా నీరందని పరిస్థితి ఎదురవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


కాలువలో మట్టి వేసి కప్పేస్తున్న అక్రమార్కులు